ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
బుధవారం 6 మార్చి 2024



కాంగిరేస్!

వరంగల్ ఎంపీ స్థానంలో భారీగా ఆశావహులు

- 42మంది దరఖాస్తు.. ఉద్యోగుల పేర్లను పరిశీలనకు తీసుకోని అధిష్ఠానం
- ఏఐసీసీకి మూడేసి పేర్లతో టీపీసీసీ ప్రతిపాదనలు
- సింగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్యల్లో చాన్స్ దక్కేదెవరికో?
- ఇద్దరిలో విజయావకాశాలపై కాంగ్రెస్ అంతర్గత సర్వే
- మంత్రులు భట్టి, కొండా, పొంగులేటి, ఎమ్మెల్యేల అభిప్రాయాల సేకరణ
- అధిష్ఠానం నిర్ణయంపై కాంగ్రెస్ కేడర్‌లో ఉత్కంఠ

వరంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ లోక్‌సభ సీటుపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ పెరుగుతోంది. వరంగల్ ఎంపీ టికెట్ కోసం అత్యధికంగా 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువగా ఉద్యోగులు ఉండటంతో వారిని పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీలో మొదటి నుంచి పని చేస్తున్నవారిని గుర్తించిన స్ర్కీనింగ్ కమిటీ ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ఏఐసీసీకి పంపింది. ప్రధానంగా గత ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన సింగపురం ఇందిరా, దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్ పేర్లను స్ర్కీనింగ్ కమిటీ ప్రతిపాదించింది. దీంతో ఏఐసీసీ ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో స్ర్కీనింగ్ కమిటీ నుంచి వచ్చిన ముగ్గురి బలబలాలపై అంతర్గత సర్వే నిర్వహిస్తోంది.

42మంది దరఖాస్తులు

వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఏకంగా 42మంది దరఖాస్తు చేసుకు న్నారు. అయితే వీరిలో ప్రభుత్వ ఉద్యోగులే డజను మందికి పైగా ఉండటం చర్చనీయాంశమైంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేంత డబ్బు ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడిదనే చర్చ జరిగింది. ఎంపీ టికె ట్ కోసం వచ్చిన దరఖాస్తుల ను ఏఐసీసీ నియమిం చిన పరిశీలన కమిటీ పరిశీలిం చింది. స్థానికేతరు లు కూడా భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. వరంగల్ ఎంపీ సీటును స్థానికేతరు లు గెలిచిన చరిత్ర లేకపోవటంతో వారి దరఖాస్తుల ను కూడా ఆ కమిటీ పక్కన పెట్టినట్టు సమాచారం. ఇక ప్రభుత్వ ఉద్యోగుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీ కోసం పని చేస్తున్న 12మందికిపైగా స్థానిక ఆశావహులను పరిశీలన కమిటీ గుర్తించింది. వీరిలో గత ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన సింగాపురం ఇందిరా, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట సీటును పార్టీ ఆదేశాలతో త్యాగం చేసిన నమిండ్ల శ్రీనివాస్ పేర్లను ఏఐసీసీ ఎన్నికల కమిటీకి చేరవేసింది. ఈ ముగ్గురు పేర్లతో పాటు నలుగురైదుగురి ప్రొఫైల్ కూడా పంపించారు. ఒకవేళ ఈ ముగ్గురు కాకుంటే ఈ నలుగురైదుగురిలో ఒక పేరు పరిశీలించాలని కూడా టీపీసీసీ విజ్ఞప్తి చేసినట్టుగా సమాచారం.

అభిప్రాయ సేకరణ

వరంగల్ ఎంపీ టికెట్ కోసం స్ర్కూటినీ కమిటీ ముగ్గురి పేర్లతో ఏఐసీసీకి జాబితాను పంపింది. ఈ జాబితాపై ఏఐసీసీ స్ర్కీనింగ్ కమిటీ రెండు రోజులుగా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సునిల్ కనుగోలు బృందంతో పాటు మరో రెండు సర్వే ఏజెన్సీలతో ఫ్లాష్ సర్వేలు నిర్వహించింది. ఈ సర్వేల్లో మొదటిరెండు స్థానాల్లో ఇందిరా, సాంబయ్య నిలిచినట్టు సమాచారం. దీంతో ఈ ఇద్దరిపై సర్వేల రిపోర్టుతో పాటు వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవవర్గ ఇన్‌చార్జ్‌ల నుంచి ఏఐసీసీ ప్రతినిధులు అభిప్రాయ సేకరణ చేసినట్టు తెలుస్తోంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, స్టేషన్‌ఘనపూర్ మినహా ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. అలాగే పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంత్రి కొండా సురేఖతో పాటు ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచి కూడా అభిప్రాయాలను ఏఐసీసీ ప్రతినిధులు సేకరించినట్లుగా సమాచారం. అంగబలం, ఆర్థిక బలం ఉండటంతో పాటు కాంగ్రెస్ పార్టీ సేవ చేసిన వారిలో ఎవరికి టికెట్ ఇచ్చిన గెలిపించేందుకు కృషి చేస్తామని మెజారిటీ ఎమ్మెల్యేలు స్పష్టం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా వరంగల్ ఎంపీ సీటుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని, పక్కాగా వరంగల్ సీటులో పాగా వేయాలని, గెలిచే అవకాశం ఉన్నవారికే ఏఐసీసీ నుంచి టికెట్ వస్తుందని ఆయన కాంగ్రెస్ నేతల వద్ద ప్రస్తావిస్తున్నట్టు సమాచారం. వరంగల్ ఎంపీ స్థానానికి సింగాపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య మధ్యే టికెట్ రేస్ ఉందన్న వ్యాఖ్యలు వినబడుతున్నాయి. దీంతో టికెట్ ఆశిస్తున్న ఇద్దరి బలబలాలను కాంగ్రెస్ అధిష్ఠానం సేకరిస్తోంది.

కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎవరు?

- బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకటనతో ఆ పార్టీల్లో ఉత్కంఠ
- మానుకోట స్థానంపై పలువురి దృష్టి

మహబూబాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవిత పేరును ప్రకటించారు. దీంతో ఇప్పటి వరకు బీఆర్ఎస్ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేసిన ఆశావహులకు నిరాశే మిగిలింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ఎవరిని ప్రకటిస్తారా అన్న విషయంలో అటు ఆ పార్టీల్లోనూ ఇటు ప్రజల్లోనూ ఉత్కంఠ కనిపిస్తోంది. అయితే ఎవరికి వారే.. తమకే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటుండడంతో కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయి. కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారితోపాటు దరఖాస్తు లేకుండానే అగ్రనేతల వద్ద ప్రయత్నాలు చేస్తున్న వారు మొత్తం 50 మంది వరకు ఉండగా.. వారిలో ఎవరికి టికెట్ అనేది ఇంకా తేలలేదు. అయితే ఎస్టీ రిజర్వుడ్‌గా మహబూబాబాద్ ఎంపీ స్థానం ఆవిర్భావ తొలి పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి కేంద్ర మంత్రిగా పనిచేసిన పోరిక బలరాంనాయక్ పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. ఇప్పటికే ఈ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టి వచ్చిన.. బలరాంనాయక్‌కే అధిష్ఠానం నుంచి సంకేతాలున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. బీజేపీలోనూ ఇరువురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. గతంలో మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన యాప సీతయ్యతో పాటు మహబూబాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిన బంజారా, గిరిజన సామాజికవర్గానికి చెందిన జాటోతు హుస్సేన్‌నాయక్ రేసులో ఉన్నారు. వారు టికెట్ తనకంటనే.. తనకంటూ ప్రచారం చేసుకోవడంతో పాటు పోటాపోటీ వాల్‌రైటింగ్స్‌తో నియోజవర్గ వ్యాప్తంగా ముందస్తు ప్రచారం చేసుకుంటున్నారు.

ముగిసిన మేడారం హుండీల లెక్కింపు

జాతర ఆదాయం రూ.12,71,79,280



హనుమకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఆదాయం మొత్తం రూ.12,71,79,280 లెక్క తేలింది. గత జాతర కన్నా రూ.26,29,553 ఎక్కువ. గత జాతర ఆదాయం రూ. 12,45,49,727. దీనితో పోల్చితే ఈసారి జాతర ఆదాయం ఏ మంత ఎక్కువ పెరగలేదు. ప్రతీ జాతరకు ఆదాయం రూ. కోటిపైనే పెరుగుతూ వచ్చింది. ఈ సారి మాత్రం ఆశించినంత పెరగలేదు. గత జాతర కన్నా ఈ సారి భక్తులు ఎక్కువగానే వచ్చినట్టు అంచనా. హుండీలను కూడా గతంలో కన్నా ఎక్కువగానే ఏర్పాటు చేశారు.. అయినా జాతర ఆదాయం పెరుగుదల రూ.26లక్షలకే పరిమితమైంది. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీల లెక్కింపు మంగళవారంతో ముగిసింది. ఆరోరోజు 50 హుండీలను లెక్కించగా రూ.1,46,09,280. జాతరలో భక్తులు బంగారం, వెండి రూపంలో వేసిన కానుకలను కూడా మంగళవారం మదింపు వేశారు. బంగారం 779 గ్రాముల 800 గ్రాములు కాగా, వెండి 55 కిలోల 150 గ్రాములు వచ్చింది. దీనిని బ్యాంకు ట్రెజరీలో భద్రపరిచారు. గత జాతర కన్నా ఈసారి బంగారం, వెండి కానుకలు కాస్త ఎక్కువగా వచ్చాయి. లెక్కించిన ఉండీ ఆదాయాన్ని బ్యాంకులో జమచేశారు. హుండీల నుంచి వెలువడిన బియ్యం మొత్తాన్ని జల్లెడపటి బస్తాల్లో నింపారు. నాణాలను లెక్కించాల్సి ఉంది. ఈ సారి నాణాలు భారీగానే వచ్చాయి.

బకాయిలు చెల్లించాకే ఫ్యాక్టరీని హస్తగతం చేసుకోవాలి

- బిల్ట్ రెగ్యులర్ కార్మికులు



బిల్ట్ ఫ్యాక్టరీ ప్రధానగేట్ వద్ద రెగ్యులర్ కార్మికులు

మంగపేట, మార్చి 5: తమకు రావాల్సిన బకాయిలను సెటిల్మెంట్ చేశాకే బిల్ట్ ఫ్యాక్టరీని ఏ సంస్థ అయినా హస్తగతం చేసుకోవాలని రెగ్యులర్ కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని కమలాపురంలో ఉన్న బిల్ట్ ఫ్యాక్టరీ ప్రధాన గేట్ వద్ద కార్మికులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్ప్ ఉత్పత్తికి డిమాండ్ తగ్గిందనే సాకుతో బిల్ట్ ఫ్యాక్టరీని మూసేశారని అన్నారు. తమను యాజమాన్యం నిర్లక్ష్యంగా కర్మగారం నుంచి బయటకు పంపించి జీవనోపాధి లేకుండా చేసిందని విమర్శించారు. రోజూ ఫ్యాక్టరీకి వచ్చి సంతకాలు చేస్తేనే వేతనాలు వస్తాయని జేఏసీ నాయకులు అప్పుడు చెప్పడంతో అదే పాటిస్తున్నామని అన్నారు. ఫ్యాక్టరీలో ఉద్యోగం లేక, బయట పనులకు వెళ్లలేక తమ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని అన్నారు. దీంతో సుమారు 74 మంది కార్మికులు మనోవేదనతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని కుదవపెట్టుకున్న ఫిన్‌క్విస్ట్ సంస్థ కార్మికుల బకాయిలను సెటిల్మెంట్ చేస్తుందంటూ ట్రిబునల్ ఈ క్రమంలోనే తీర్పు ఇచ్చిందన్నారు. అయితే ఒక్కో కార్మికుడికి రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉండగా రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల వరకే బ్యాంకు ఖాతాల్లో వేసి మోసం చేశారని ఆరోపించారు.

ఫ్యాక్టరీని హస్తగతం చేసుకోవా లనుకొనే సంస్థ తమకు పెడింగ్ వేతనాలు, గ్రాడ్యూటీ పూర్తిస్థాయిలో చెల్లించా లని అన్నారు. ఆ తర్వాతే ఫ్యాక్టరీని హస్తగతం చేసుకోవాలని డిమండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు తాము న్యాయ పోరాటం చేస్తూనే ఉంటామని అన్నారు.

గ్యారెంటీ పథకాలు అర్హులందరికీ దక్కాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, మార్చి 5: జిల్లాలో ని అర్హులందరికీ ప్రభుత్వ గ్యారెంటీ పథ కాల లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీతో కలిసి జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా లబ్ధిదారుల వివరాల నమోదు, అర్హులకు గ్యారెంటీ పథకాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభు త్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రతి మండ లంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాలన ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్‌మీటర్ నంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే రూ.500 గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు జరుగుతోందని అన్నారు. గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లు లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగా నమోదు చేసుకోని వారు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా తప్పులను సవరించుకోవచ్చని అన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో విని యోగించే సాఫ్ట్‌వేర్ పనితీరును క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణంగా వివరిం చాలని సూచించారు. లబ్ధిదారుల ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డు వివరాల ద్వారా ప్రజాపాలన దరఖాస్తులను గుర్తించాలని, తద్వారా లబ్ధిదారులు అందించే గ్యాస్ కనెక్షన్, విద్యుత్ మీటర్ నంబర్ వివరాలను వ్యాలిడేట్ చేయాలని అన్నారు.

భూసమస్యలపై తహసీల్దార్లు అవగాహన కలిగి ఉండాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 5: భూ సమస్యలపై తహసీల్దార్లు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో ఆయన తహసీల్దార్లతో మంగళవారం సమావేశమయ్యారు. ధరణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల సౌకార్యాల కల్పనపై సమీక్షించారు. భూ సమస్యల పరిష్కారంలో ఫైళ్ల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైళ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ ప్రక్రియను ఎలాంటి లోపాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ధరణి రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గణపురం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. సీఎం ప్రజావాణి నుంచి జిల్లాకు వచ్చిన 64 దరఖాస్తుల్లో ఆరింటిఇ పరిష్కరించామన్నారు. వచ్చే సోమవారం నాటికి మిగిలినవి పరిష్కరించాలన్నారు.

రేపటి నుంచి కాళేశ్వరంలో శివరాత్రి వేడుకలు

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి): మార్చి 5: మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమ గోదావరిలో వెలసిన కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానంలో మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి జాతర గురువారం నుంచి ప్రారంభం కానుంది. శోభకృత్ నామ సంవత్సర మాఘ బహుళ ద్వాదశి శుక్రవారం మొదలు చతుర్దశి శనివారం వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

గురువారం ఉదయం 10 గంటలకు మంగళవాయిద్యాల నడుమ దీపారా ధన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, రక్ష బంధనం, దీక్షా వస్త్రధారణ, నవకలశారాధన, నవగ్రహ ఆరాధనం, మండప దేవతారాధన, వృషభధ్వజ పటాదివాసం జరగనున్నాయి. సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం, రాత్రి 8 గంటలకు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు, ఎదురుకోలు సేవ, రాత్రి 8.30కు ప్రసిద్ధ కళాకారులతో భక్తి సంగీత తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

శుక్రవారం సాయంత్రం 4.35 గంటలకు ధనిష్ఠ నక్షత్రయుక్త కర్కాటక లగ్న సమయాన శ్రీ ముక్తీశ్వర శుభానందలకు కల్యాణ మహోత్సవం, అక్షతారోహణం, రాత్రి 8 గంటలకు హరికథా కాలక్షేపం తదతర సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. రాత్రి 12 గంటలకు మహాభిషేకం, లింగోద్భవపూజ, కాళరాత్రి చండీ హవనం నిర్వహించనున్నారు.

శనివారం ఉదయం 8 గంటలకు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం మధ్యాహ్నం 12.00 గంటలకు పూర్ణాహుతి, సదస్యం మహదాశీర్వాదం, పండిత సన్మానం, సాయంత్రం 4 గంటలకు శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి వారికి కల్యాణం, రాత్రి 8 గంటలకు నాకబలి తదనంతరం పవళింపు సేవ నిర్వహించనున్నారు.

ఈ మూడు రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఆర్టీసీ నడపనుంది. వరంగల్, పరకాల, భూపాలపల్లి, కరీంనగర్, మంథని, మంచిర్యాలతోపాటు పలు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో జాతర జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 250 మందితో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. కాటారం డీఎస్పీతోపాటు ఐదుగురు సీఐలు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. సుమారు లక్ష మంది భక్తులు ఈ వేడుకలకు హాజరు కానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లను పూర్తి చేశామని ఈవో మారుతి తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లు, టెంట్లు, తాగునీటి తదితర మౌలిక సౌకర్యాలను సమకూర్చామని అన్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలు, పూలతో అలంకరించామని చెప్పారు.



విద్యుద్దీపాలంకరణలో కాళేశ్వరాలయం

గృహజ్యోతి పథకం.. ఓ వరం

ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మొగుళ్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు


భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి): మార్చి 5: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం పేదింటి ప్రజలకు వరంలాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఆవరణలో గృహజ్యోతి, 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో 28మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి రెండు పథకాలను అమలుచేసిందన్నారు. తాజాగా 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందించి పథకాన్ని ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో జయశ్రీ, ఎంపీపీ యార సుజాత, విద్యుత్‌శాఖ ఏఈ ప్రమోద్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, సుదర్శన్, రాజు, లింగారావు, రాము, రఫీ, ప్రకాష్‌రావు, సదాశివరెడ్డి, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

నియోజకవర్గం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రేగొండ, గోరికొత్తపల్లి మండలాలలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల అప్పులు మిగిల్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, మాజీ సింగిల్‌విండో చైర్మన్ గుంటోజు కిష్టయ్య, నాయకులు ఎడ్ల మల్లారెడ్డి, కొలెపాక సాంబయ్య, మేకల భిక్షపతి, నాంసాని రాంబాబు, సూరం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ విధానాలను ప్రతిఘటించండి

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు

గోవిందరావుపేట, మార్చి 5: ప్రధాని నరేంద్రమోదీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మండలంలోని పస్రాలో గుండు రామస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగిన రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశంలో పోతినేని మాట్లాడారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు నల్లచట్టాల వల్ల 750 మంది రైతులు మరణించారని, ఆ సమయంలో ప్రధాని మోదీ రైతులకు క్షమాపణ చెప్పి డిమాండ్లను నెరవేరుస్తానని, పంటలకు మద్దతు ధర కల్పిస్తామని పార్లమెంట్ సాక్షిగా మాట ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. స్వామినాథన్ సిఫారసు ప్రకారం రైతులకు మద్యంతర చట్టం తేవాలని, రైతులపై నిర్బంధం ఆపాలని, పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ములుగు జిల్లాలో ఉన్న లక్నవరం సరస్సు, గుండ్లవాగు ప్రాజెక్టు, వాజేడులోని మోడికుంటలకు గోదావరి నీటిని మళ్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు ఎమ్డీ.గఫూర్‌పాషా, సామ చంద్రారెడ్డి, తీగల ఆదిరెడ్డి, కాప కోటేశ్వర్‌రావు, సారయ్య, ముత్తయ్య, రామారావు, సురేష్, నాగేశ్వర్‌రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గట్టమ్మ వద్ద ఘర్షణ ఘటనలో ఎఫ్ఐఆర్

మాజీ సర్పంచ్ సహా 12 మందిపై అట్రాసిటీ కేసు

ఆలయం వద్ద పోలీసుల పటిష్ఠ బందోబస్తు



గట్టమ్మ దేవాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

ములుగు, మార్చి 5: జిల్లా కేంద్రం సమీపంలోని గట్టమ్మ దేవాలయం వద్ద సోమవారం నాయకపోడ్‌లు, ముదిరాజ్‌ల మధ్య జరిగిన ఘర్షణ ఘటనలో 12 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. తాజా మాజీ సర్పంచ్ దాసరి రమేష్ తోపాటు మరో 11 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. గట్టమ్మ దేవాలయంపై హక్కుల విషయంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సముదాయించినా వినిపించుకోకుండా దాడికి దిగడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఈ క్రమంలో గట్టమ్మ ఆలయ నాయకపోడ్ ప్రధాన పూజారి కొత్త సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ సర్పంచ్ రమేష్, ముదిరాజ్ పెద్దమనుషులు ఈర్ల చేరాలు, బొద్దుల అయిలయ్య, దండబోయిన భిక్షపతి, మామిడిశెట్టి మల్లయ్య, జగలం పుష్పలీల, వనం అశ్విని, అనుముల కవిత, సామంతుల స్వప్న, అన్నబోయిన జయ, కుక్కల కేత, వనం సునీతపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. కాగా, సోమవారం రోజంతా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా మళ్లీ గొడవ జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పికెటింగ్ నిర్వహించారు. ఎస్సై ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

'లహరి' బస్సుల్లో సుఖవంతమైన ప్రయాణం

ప్రయాణికులకు సౌకర్యంగా పడకలు




లహరి బస్సుల్లో సౌకర్యాలు

సుబేదారి, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం వరంగల్-1 డిపోకు నాలుగు లహరి సెమీ స్లీపర్ బస్సులను కేటాయించింది. గత నెల 3వ తేదీన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ బస్సులను హనుమకొండ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ బస్సులను ఆర్టీసీ అధికారులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఇందులో స్లీపర్, సీటర్ సౌకర్యం ఉంది. ప్రయాణికులకు ఈ బస్సుల్లో 20 బెడ్స్, 22 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 20 మంది ప్రయాణికులు పడుకునేందుకు వీలుగా, 22 మంది ప్రయాణికులు కూర్చుని వెళ్లేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు ఈ బస్సుల్లో ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు రోజు రెండు బస్సులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సు రోజు సాయంత్రం 4:30 గంటలకు ఒక బస్సు, 6:30 గంటలకు మరో బస్సును బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సుల్లో మంటలు, ఇంజన్‌లో పొగలు వస్తే సెన్సార్ల ద్వారా గుర్తించవచ్చు. బటన్ నొక్కితే ఈ బస్సు ప్రయాణించే దగ్గరి డిపోలకు ఇన్ఫర్మేషన్ వెలుతుంది. అప్పుడు అధికారులు అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడుకోవచ్చు.

ప్రయాణికులకు సౌకర్యంగా బెడ్స్

హనుమకొండ నుంచి బెంగళూరుకు ప్రయాణించే ప్రయాణికులలో ఎక్కువ మంది ఉద్యోగులు ఉంటారు. గతంలో ఈ బస్సులో లేనప్పుడు వేరే ఆర్టీసీ బస్సులలో కూర్చుని ప్రయాణించినప్పుడు ప్రయాణికులు అలసిపోయి తెల్లారి ఉద్యోగానికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉండేది. లహరి బస్సులలో బెడ్స్ సౌకర్యం ఉండడంతో పడుకుని ప్రయాణించడం వలన ఎలాంటి ఇబ్బంది, అలసట ఉండదు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాల్లో ఉద్యోగుల్లేరు..

● అన్ని పోస్టులు ఖాళీ ● ఇన్‌చార్జిలే దిక్కు ● 30 ఏళ్ల నుంచి నియామకాల్లేవు ● ఉన్న ఉద్యోగులపై పని భారం
● సిబ్బంది లేక ఇబ్బందులు ● ఉమ్మడి జిల్లాలో దీనస్థితిలో గ్రంథాలయాలు ● నోటిఫికేషన్లతో లైబ్రరీలకు నిరుద్యోగులు పరుగు


జనగామ జిల్లా బచ్చన్నపేటలోని శాఖా గ్రంథాలయం


ములుగు జిల్లా కేంద్ర గ్రంథాలయం

హనుమకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : యువత సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. విజ్ఞానానికి, విరామకాల సద్వినియోగానికి, విశేషజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు మానవ జీవితంలో విడదీయరాని సంబంధం కలిగి ఉంటున్నాయి. ఆధునిక యుగంలో సౌకర్యాలెన్ని పెరిగినా విద్యార్థులకు, ఉద్యోగార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞానార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారాలు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా, ఉద్యోగార్థులను ఉద్యోగస్తులుగా చేయడంలో కీలక భూమిక పోషించే గ్రంథాలయాలు ఉద్యోగుల కొరతతో కూనారిల్లుతున్నాయి. ఉద్యోగవేటలో ఉన్న నిరుద్యోగులకు చేయూతనిస్తున్న గ్రంథాలయాలే చాలినంత సిబ్బంది లేక చచ్చుపడి పోతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లను జారీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లోని ఖాళీలను పట్టించుకోవడం లేదు.

ఉద్యోగార్థుల పరుగులు

గ్రంథాలయాలు విద్యార్థులు, ఉద్యోగార్థుల పాలిట కల్పతరువుగా నిలుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నేపథ్యంలో మెగా డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో యువత పఠనాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో కొన్ని రోజులుగా గ్రంథాలయాలు సందడిగా కనినిస్తున్నాయి. కానీ అక్కడ శాశ్వత సిబ్బంది లేక వెక్కిరిస్తున్న ఖాళీలతో వాటి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతో నిర్వహణ కొరవడి పాఠకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

30 ఏళ్లుగా నియామకాల్లేవు

1995లో శాఖాపరంగా ఉద్యోగాలు భర్తీ చేశారు. ఆ తర్వాత కాలంలో గ్రంథాలయాల్లో ఉద్యోగుల నియామకాలు జరగలేదు. ఈమధ్యకాలంలో అనేక మంది రిటైర్ అయ్యారు. గ్రంథపాలకులు మొదలుకొని స్వీపర్ల వరకు అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. అయినా ఈ మూడు దశాబ్దాలకాలంలో వచ్చిన ప్రభుత్వాలు ఏవీ వాటిని భర్తీ చేయలేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే ప్రభుత్వం నెట్టుకువస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉన్నారు. సిబ్బంది కొరతవల్ల వారిపై అదనపు పనిభారం పడుతోంది. కొన్ని శాఖా గ్రంథాలయాల్లో స్వీపర్లే ఇన్‌చార్జి గ్రంథపాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఒకే ఉద్యోగి రెండు, మూడు గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఒక్కోదానికి రెండు లేదా మూడు రోజులు కేటాయిస్తున్నాడు. గ్రంథ పాలకులు లేని రోజుల్లో అటెండరు లేదా స్వీపర్లు గ్రంథాలయాన్ని తెరిచి దినపత్రికలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. బుక్ సెక్షన్లు మూసే ఉంటున్నాయి. సిబ్బంది కొరత వల్ల చాలా చోట్ల గ్రంథాలయాలను ఎప్పుడు తెరుస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమకు ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉందని ఉద్యోగార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు

గ్రంథాలయాల వ్యవస్థను ఒక ప్రభుత్వ శాఖగా కాక దానినొక సంస్థగా భావిస్తుండడంవల్ల పట్టింపు లేకుండా పోయింది. గ్రంథాలయ సంస్థలు రాజకీయ పదవులకు పునరావాస కేంద్రాలుగా మాత్రమే పనికొస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు అనుకూలమైనవారికి నామినేటెడ్ పదవుల పందారంలో భాగంగా చైర్మన్లను నియమించడంలో ఉన్న శ్రద్ధ.. వాటి నిర్వహణలో కీలక పాత్ర పోషించే సిబ్బందిని నియమించడంలో చూపడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో వాటి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. చైర్మన్లుగా నియమితులైన వారు సిబ్బంది కొరత వల్ల సైతం గ్రంథాలయాల నిర్వహణను మెరుగుపరచలేకపోతున్నారు.

కనీస వసతులు కరవు

జిల్లా కేంద్రాల్లోని గ్రంథాలయాలకు అరకొర నిధులు ఇవ్వడం మినహా వాటి అభివృద్ధికి పెద్దగా చర్యలు తీసుకోలేదు. మున్సిపాలిటీల నుంచి వచ్చే గ్రంథాల సెస్సే వాటికి ఆర్థిక వనరు. అవి చెల్లించే నిధులతోనే ఏదో విధంగా నెట్టుకువస్తున్నాయి. గ్రామాల్లో పంచాయతీల నుంచి వచ్చే లైబ్రరీ సెస్సు చాలా తక్కువ. చాలా పంచాయతీలు వీటిని చెల్లించడం లేదు. దీంతో గ్రామాల్లో శాఖా గ్రంథాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. శాఖా గ్రంథాలయాల్లో చాలా వాటికి స్వంత భవనాలు లేవు. అన్నీ అద్దె ఇళ్లలో అరకొర వస్తుల నడుప నడుస్తున్నాయి. పాఠకులు చదువుకోవడానికి కనీస వసతులు మచ్చుకైనా కానరావు. చాలినన్నీ కుర్చీలు, బెంచీలు లేవు. ఇక పుస్తకాల అందుబాటు అంతంత మాత్రమే..

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలలో ఆరు జిల్లా గ్రంథాలయాలు, 66 శాఖా గ్రంథాలయాలు, ఒక ప్రాంతీయ గ్రంథాలయం ఉన్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక లైబ్రరీ. దీనికి సొంత భవనం ఉంది. ఇందులో చాలినంత మంది ఉద్యోగులున్నారు. వీరికి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లిస్తుంది. మిగతా గ్రంథాలయాల పరిస్థితి వేరు. ఇవన్నీ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో పనిచేసే వారంతా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు. మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్సుద్వారా వచ్చే ఆదాయం నుంచే వీరికి వేతనాలు.

20 ఖాళీలు

హనుమకొండ జిల్లాకు సంబంధించి 33 శాంక్షన్డ్ పోస్టులకుగాను ప్రస్తుతం 13మంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ లైబ్రేరియన్లు అయిదుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు ఔట్‌సోర్సింగ్ విధానం కింద పని చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది అంతా పార్ట్‌టైమర్సే. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉమ్మడి జిల్లా అంతటికి అతిపెద్ద లైబ్రరీ. దీనితోపాటు 11 శాఖా గ్రంథాలయాలు, అయిదు గ్రామ గ్రంథాలయాలు, ఒక పిల్లల లైబ్రరీ ఉన్నాయి. ఉద్యోగుల కొరతవల్ల ఒక్కొక్కరు రెండు అంతకన్నా ఎక్కువ గ్రంథాలయాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇద్దరు గ్రేడ్ 2 లైబ్రేరియన్లకు బదులు ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. మరొకరిని డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. ఇద్దరు వాచ్‌మెన్లు ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించడంతో ఉద్యోగార్థుల కోసం ఈ గ్రంథాలయం పని వేళలను పెంచారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తోంది. చాలినంత మంది సిబ్బంది లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు 11 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ 11 లైబ్రరీల్లో రెండింటికే పూర్తికాలపు లైబ్రేరియన్లు ఉన్నారు. మిగతా ఎనిమిదింటిని పంచాయతీ సిబ్బందితో నెట్టుకువస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో జిల్లా లైబ్రరీతో పాటు 12 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖా లైబ్రరీలు పార్ట్‌టైమ్ ఉద్యోగులతో నడుస్తున్నాయి. ములుగు జిల్లా పరిధిలో తొమ్మిది లైబ్రరీలు ఉన్నాయి. ములుగులో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంటకాపురం (నూగూరు)లో శాఖా గ్రంథాలయాలున్నాయి. ఈ తొమ్మిది లైబ్రరీలలో ఎనిమిదింటికి గ్రంథపాలకులు లేరు. కొత్త నియామకాలు లేకపోవడంతో వీటి బాధ్యతలు ఇన్‌చార్జిలకు అప్పగించారు. ములుగు సెంట్రల్ లైబ్రరీలో ఒక గ్రేడ్ 1, ఇద్దరు గ్రేడ్ 2, లైబ్రేరియన్లు, ఇద్దరు అటెండర్లు, వాచ్‌మెన్, స్వీపర్, బుక్‌కీపర్, బైండింగ్ వర్కర్, జూనియర్, సీనియర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనగామలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు పది శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖ లైబ్రరీల్లో వేటికి పూర్తికాలపు లైబ్రేరియన్లు లేరు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తున్నారు.

నేటి నుంచి కేయూలో రూబీజెస్ట్

కేయూ క్యాంపస్, మార్చి 5: కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 6, 7 తేదీల్లో రూబీజెస్ట్-24 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం ప్రారంభం కానున్న రెండు రోజుల సంబురాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు హాజరుకానున్నారు. కేయూ ఆడిటోరియంలో కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు సంబురాలు వైభవంగా షురూ అవుతాయి. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో టెక్నికల్ సెషన్లు, చర్చలు, సెమినార్‌హాల్‌లో ఆఖరు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా మంగళవారం కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంలు రూబీజెస్ట్-24 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే మంగళవారం సాయంత్రం రూబీజెస్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు.

ఆటో డ్రైవర్లకు అండగా నిలవాలి

వడ్డెపల్లి, మార్చి 5: ఆటోడ్రైవర్లకు పోలీసు శాఖ అండగా నిలవాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటో డ్రైవర్స్ జేఏసీ చైర్మన్ ఎమ్డీ అంకూషా వలి, జిల్లా గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్ గౌడ్ తదితరులు హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను వారు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో ఆటో డ్రైవర్స్ జేఏసీ వైస్ చైర్మన్ పసుల యాదగిరి, కన్వీనర్లు దేవర మల్లేష్, బండి లింగయ్య, ఓరుగంటి సదానందం ఉన్నారు.

హామీలను దాటవేసే ప్రయత్నంలో కాంగ్రెస్

తిరుమలలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చిందని, కానీ ఇచ్చిన ప్రతి హామీని దాటవేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.పదేళ్ల పాటు రాష్ట్రంలో బ్రహ్మాండమైన పరిపాలన అందించినప్పటికీ ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా పరిపాలన చేస్తున్నారన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా మొదలైందన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చేందుకు పోరాడే శక్తిని కేసీఆర్‌కు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.ప్రజలపక్షాన పోరాడే నాయకులను మాత్రమే ఎంపీలుగా ఎన్నుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రజలను కోరారు.

గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలి

వడ్డెపల్లి, మార్చి 5: ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ పేరుతో హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలని గద్దర్ ఆలోచన ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ మంచాల ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గద్దర్ విగ్రహాన్ని అన్ని జిల్లాల కేంద్రాలలో ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో గద్దర్ ఆలోచన వేదిక రాష్ట్ర కో కన్వీనర్ ఐత అనిల్, రాష్ట్ర కో ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

ఇస్రో పిలుస్తోంది..

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహనే లక్ష్యం ● భావి శాస్త్రవేత్తలకు వేదిక.. యువికా.. ● 9వ తరగతి విద్యార్థులకు దరఖాస్తుల ఆహ్వానం
● ఈనెల 20 వరకు అవకాశం ● ఈనెల 28, ఏప్రిల్ 4న ఎంపిక జాబితా ● ఎంపికైన వారికి మే 13 నుంచి శిక్షణ

జఫర్‌గడ్, మార్చి 5 : పిల్లల ఆలోచనలకు మెరుగులు దిద్దితే భావి తరానికి శాస్త్రవేత్తలుగా మార్చుకోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్షపరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఓవినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమికజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా యంగ్ సైంటిస్ట్ పేరుతో యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువికా) 2019 నుంచి నిర్వహిస్తోంది. బాల్యదశ నుంచే శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితం ఆధారిత పరిశోధన కెరీర్‌లో కొనసాగే వారికి ఇది వేదికగా నిలుస్తోంది. 2024 సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అర్హులు. ప్రస్తుతం దరఖాస్తుప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. అర్హత, ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

ఈనెల 20 వరకు దరఖాస్తుకు అవకాశం

ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా www.isro.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2024, జనవరి 1 నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రెండు రోజుల తరువాత ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన గంట తరువాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఈనెల 28న మొదటి ఎంపిక జాబితా, ఏప్రిల్ 4న రెండో ఎంపిక జాబితాలను ప్రకటిస్తారు. ఎంపికైన వారు మే 12న ఇస్రో సూచించిన కేంద్రాలవద్ద రిపోర్టు చేయాలి.

దరఖాస్తుకు అర్హతలు - వెయిటేజీ కేటాయింపు

దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 8వ తరగతిలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. 9వ తరగతి విద్యార్థులుసహ పాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలి. స్పోర్ట్స్ అండ్ గేమ్స్, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటే ఐదు మార్కులు, గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థికి మరో 15 శాతం అదనపు అర్హత కల్పిస్తారు. ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి 10 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు.

శాస్త్ర, సాంకేతికంపై శిక్షణ

యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మే 13 నుంచి 25వ తేదీ వరకు ఇస్రోకు సంబంధించి దేశంలోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్-బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్స్‌సెంటర్ -అహ్మదాబాద్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ - తిరువనంతపురం, నార్త్ ఈస్ట్ అప్లికేషన్ సెంటర్ - షిల్లాంగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - డెహ్రాడూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - హైదరాబాద్, నిటీష్‌ధావన్ స్పేస్ సెంటర్ - శ్రీహరికోట ఈ ఏడు కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించి శిక్షణ ఇస్తారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు వంటివి నిర్వహించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం, రాకెట్ ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. కాగా, ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లింపుతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : పి.రఘునందన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, జనగామ



ఆసక్తి గల 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ అవగాహన పెంచుతుంది. తద్వారా విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుంది. విద్యార్థులు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక లాంటిది. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

హనుమకొండ మత్స్యశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ యాదవ్ తనపై వేధింపులకు పాల్పడుతున్నారని, కులంపేరుతో దూషించటంతోపాటు అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఫిషరీస్ అసిస్టెంట్ పి. మేఘన ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు ఫిర్యాదు కాపీని మంగళవారం మీడియాకు విడుదలచేశారు. హనుమకొండ జిల్లా కార్యాలయం నుంచి భీమారం ఫిష్ ఫామ్‌కు తనను బదిలీచేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఫిష్ ఫామ్‌లో ఒంటరి మహిళకు విధులు వేసి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఐఎఫ్‌టీసీ, ఐనవోలు మండల బాధ్యతల నుంచి కూడా అకారణంగా తప్పించారని తెలిపారు. సిబ్బంది ఎదుట తనను కులం పేరుతో దూషించటంతోపాటు అసభ్యకరమైన వాట్సప్ మెసేజ్‌లు పెడుతున్నారని, పరుష పదజాలంతో మాట్లాడుతున్న నరేష్ కుమార్ నాయుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేఘన విజ్ఞప్తిచేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

హనుమకొండ క్రైం, మార్చి 5: సుబేదారి పీఎస్ పరిధిలోని గాయత్రి కాలనీలో ఏడుగురు పేకాటరాయుళ్లను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15వేల నగదుతో పాటు 2 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని గాయత్రికాలనీలో కొద్ది రోజులుగా ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు పక్కా సమాచారం అందింది. తమ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసి 7 గురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి రూ.15వేల నగదు బైక్స్, సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జూదరులను సుబేదారి పోలీసులకు అప్పగించి గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

భీమునిపాదం వద్ద అరుదైన పక్షులు

కనువిందు చేస్తున్న ఇండియన్ పార్యరడైజ్ ఫ్లైక్యాచర్, మెడల్ ఉడ్ ఓవల్ (గుడ్లగూబ), జంగిల్ ఓవ్‌లెట్ పక్షులు


ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్

మహబూబాబాద్ జిల్లా భీమునిపాదం జలపాతం వద్ద అరుదైన పక్షులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వలస వచ్చిన పక్షులు ఇక్కడ చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి అందాలకు ప్రతీక అయిన భీమునిపాదం వద్ద అనేక రకాల పక్షులు ఆవాసం ఏర్పరచుకోవడం కనిపిస్తోంది. వాటిల్లో ఒకటి ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్. ఈ వింత పక్షి మెడ నల్లగా ఉండి, మిగతా శరీర భాగం తెల్లగా ఉంటుంది. తలపై అదే నల్లరంగులో జుట్టు ఉంటుంది. దీని తోకభాగం తెల్లని ఈకెలతో చాలా పొడవుగా ఉంటుంది. ఈ పక్షికి ఈ తోకే ఆకర్షణీయం. ఇక్కడ దర్శనమిస్తున్న మరో పక్షి గుడ్లగూబ. గుడ్లగూబలు సాధారణంగా అడవుల్లో చెట్లకొమ్మలపై ఉంటాయి. సాధారణంగా కనిపించే గుడ్లగూబ కన్నా భీమునిపాదం వద్ద దర్శనమిస్తున్న గుడ్లగూబ పక్షి భిన్నంగా ఉంది. దీనిని మెటల్డ్ వుడ్ ఏవెల్. దీని ఈకలు అచ్చం చెట్టు బెరడు రంగులో ఉంటాయి. అందువల్ల చెట్లపై ఉన్నప్పుడు ఆ చెట్టుబెరడు రంగుతో కలిపిపోయి గుర్తించడం కష్టంగా ఉంటుంది. అందుకే దీనికి లోహపురంగుతో కూడి చెట్టుబెరడు గుడ్లగూబగా పేరువచ్చింది, దీని పిల్లలు బూడిద రంగులో ఉంటాయి. పెరిగిన తర్వాత రంగుమారుతాయి. ఇక్కడే మరో రకం గుడ్లగూబ కూడా సందర్శకులకు కనువిందు చేస్తుంది. ఇది అడవి గుడ్లగూబ. సాధారణంగా అడవిలో మనకు ఎక్కువగా కనిపించే పక్షి ఇదే. దీనిని జంగిల్ ఓవ్‌లెట్ అని పిలుస్తారు. ఇదేకాకుండా అనేక ఇతర జాతి పక్షులను కూడా ఇక్కడ చూడవచ్చు.


జంగిల్ ఓవ్‌లెట్


మెటల్డ్ వుడ్ ఓవెల్

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

భ్రూణ హత్యలకు పాల్పడితే చర్యలు తప్పవు

జడ్పీ సమావేశంలో చైర్‌పర్సన్ నాగజ్యోతి

లింగ నిర్ధారణపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

ములుగు కలెక్టరేట్, మార్చి 5: జిల్లాలో భ్రూణ హత్యలకు పాల్పడితే చర్యలు తప్పవని జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. ములుగులోని జడ్పీలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అన్నిశాఖల నివేదికలను పరిశీలించి అధికారులతో చర్చించారు. వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డి, ఏడ్జర్లపల్లి గ్రామాల్లో ప్రబలుతున్న వైరల్ జ్వరాలు, ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏటూరునాగారంలో మహిళల కోసం కుటుంబ నియంత్రణ శిబిరాలు ఏర్పాటు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వెంకటాపూర్ మండలకేంద్రంలో సభ్యులు సూచించిన పనులు పూర్తి చేయాలని అన్నారు. యాసంగి పంటకు సంబంధించిన రైతుబంధు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఎప్పటిలాగానే వెంటనే వారికి నిధులు జమ చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. రైతుబీమా అమలులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలన్నారు. పంటలకు మద్దతు ధర అందించాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖకు సూచించారు. సీనరేజీ నిధులు జడ్పీ ఖాతాలో జమ అయ్యేలా అధికారులు చూడాలన్నారు. ఇసుక రీచ్‌ల నిర్వహణలో స్థానిక సొసైటీల పాత్ర లేకుండా కాంట్రాక్టర్లు



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నాగజ్యోతి

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారి ఆగడాలను అరికట్టి గిరిజన ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. మేడారం జాతర అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని, నాసిరకం పనులు చేపట్టారని అన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అటవీశాఖ అధికారులు వ్యవహరించాలని, రోడ్ల నిర్మాణంలో ఉన్న అవంతరాలను అధిగమించి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు సహకరించాలని అన్నారు. సమావేశానికి ముందస్తు అనుమతి పొందకుండా గైర్హాజరైన ఎక్సైజ్‌శాఖ అధికారులపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈ సమావేశంలో జిల్లాలోని జడ్పీటీసీలు గై రుద్రమదేవి, తుమ్మల హరిబాబు, నామ కరమ్‌చంద్‌గాంధీ, తల్లడి పుష్పలత, పాయం రమణ, జడ్పీ కోఆప్షన్ సభ్యులు వలియాబీ, రియాజ్‌మీర్జా, ఎంపీపీలు శ్రీనివాసరెడ్డి, బుర్ర రజిత, జనగాం సమ్మక్క, జడ్పీ డిప్యూటీ సీఈవో రమాదేవి, డీఎంహెచ్‌వో అప్పయ్య, జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, విద్యాశాఖ క్వాలిటీ కంట్రోలర్ సుదర్శన్‌రెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామప్ప భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 5: మహాశివరాత్రి సందర్భంగా రామప్ప దేవాలయాన్ని సందర్శించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోనున్నట్లు ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. మంగళవారం ఆయన పోలీసు అధికారులతో కలిసి రామప్ప దేవాలయం ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలింగేశ్వరస్వామి సన్నిధిలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షించాలన్నారు. సరస్సు ప్రాంతానికి సాయంత్రం 6 గంటల తర్వాత భక్తులకు అనుమతి ఇవ్వొద్దని సూచించారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఆయన వెంట ములుగు సీఐ మేకల రంజిత్‌కుమార్, స్థానిక ఎస్సై చల్ల రాజు, సిబ్బంది ఉన్నారు.

తాగు నీటి ఎద్దడిని నివారించాలి

మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సీఈ శ్రీనివాసరావు

కాటారం, మార్చి 5: వేసవిలో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి రాకుండా పకడ్బందీగా నివారణ చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కాటారం మండలంలోని ఇబ్రహీంపల్లి, మహా ముత్తారం మండలంలోని మాదారం గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో నల్లాల ద్వారా నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. నీటి సరఫరా సక్రమంగా జరుగుతున్నదా.. లేదా? అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీపీ కార్యాలయంలో మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించారు. గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా జీపీల పరిధిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా జీపీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు అందరు కృషి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఈ మల్లేషం, ఈఈలు నిర్మల, మాణిక్‌రావు, డీఈఈలు కిరణ్, రమేష్, ఏఈలు రాజశేఖర్, కళ్యాణ్, జీపీ కార్యదర్శి మల్లికార్జున్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జనజీవన స్రవంతిలో కలవండి

మావోయిస్టులు లొంగిపోవాలంటూ పోలీసుల పోస్టర్లు

తాడ్వాయి, మార్చి 5: 'మావోయిస్టులారా హింసను వీడండి... జనంలో కలవండి... అభివృద్ధిలో భాగస్వామంకండి' అంటూ పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పోస్టర్లను ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్లు, వాటర్ ట్యాంకులు, బస్టాండ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో పోస్టర్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా గొత్తికోయగూడాల్లో ఇళ్ల గోడలకు పోస్టర్లను అంటించారు. 'మీ కుటుంబం మీకోసం ఎదురు చూస్తోంది.. మీ ఊరు రమ్మంటోంది.. మీ స్వేచ్ఛకు, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భరోసా ఇస్తుంది.. మావద్దకు వచ్చిన వెంటనే మీ ఇంటికి వెళ్లొచ్చు. మీకు పునరావాసం కల్పిస్తాం' అంటూ ఎస్పీ పేరుతో మండల వ్యాప్తంగా పోలీసులు పోస్టర్లను ఏర్పాటు చేశారు.

- గోవిందరావుపేట: అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవనాన్ని గడపాలని పస్రా సీఐ శంకర్ అన్నారు. ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు సీఐతోపాటు ఎస్సై షేక్‌మస్తాన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మండలంలోని గ్రామాల్లో పోస్టర్లను ఏర్పాటు చేశారు. సీఐ శంకర్ మాట్లాడుతూ మావోయిస్టులు హింస, సిద్ధాంతాలను వదిలేసి జనంలోకి వచ్చి కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు పోలీసు శాఖ, ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఐపీఎస్ అధికారి తల్లికి సీతక్క పరామర్శ


ఐపీఎస్ అధికారి తల్లిని పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, మార్చి 5: ఐపీఎస్ అధికారి సంగ్రామ్‌సింగ్ జి.పాటిల్ తల్లి మంగళ్‌పాటిల్‌ను రాష్ట్ర మంత్రి సీతక్క పరామర్శించారు. హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం అక్కడకు వెళ్లిన మంత్రి ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సంగ్రామ్‌సింగ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సంగ్రామ్‌సింగ్ గతంలో ములుగు, మహబూబాబాద్ ఎస్పీగా పనిచేశారు.

కాటారం ఆర్డీవో బదిలీ

కాటారం, మార్చి 5: కాటారం రెవెన్యూ డివిజన్ అధికారి కన్నం నారాయణ బదిలీ అయ్యారు. పరకాల ఆర్డీవోగా వెళ్లారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 అక్టోబరు 7న కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ ఫైనల్ నోటిఫికేషన్ జారీ అయింది. అక్టోబరు 9న మధ్యాహ్నం ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తుందని ప్రచారం కావడంతో అదే రోజు ఉదయం అధికారులు భూపాలపల్లిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ విభాగం)గా పనిచేస్తున్న డాక్టర్ కన్నం నారాయణకు కాటారం ఆర్డీవోగా పూర్తి అదనపు బాధ్యతలిచ్చారు. దీంతో ఆయన చేతుల మీదుగా ఆర్డీవో కార్యాలయం ప్రారంభమైంది. ఈ క్రమంలో క్యాడర్ స్ట్రెంథ్ ప్రకటించకపోవడంతో ఆర్డీవో పోస్టు నామమాత్రమే అయింది. ప్రభుత్వం కాటారం రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అధికారులు, సిబ్బందిని నియమించి సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

గృహ పథకంలో పేదలకు ప్రాధాన్యమివ్వాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రవీందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 5: రూ.5లక్షల గృహపథకంలో పేదలకు ప్రాధాన్యమివ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో బోడ రమేష్ అధ్యక్షతన మంగళవారం జరిగిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుండడం గర్వించతగ్గ విషయమన్నారు. ఈనెల 11 నుంచి ప్రారంభించే గృహపథకంలో నిజమైన పేదవారిని గుర్తించి స్థలంతోపాటు రూ.5లక్షల నగదు అందించాలని కోరారు. అదేవిధంగా స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు అందించే పథకంలో ఇల్లులేని వారిని మాత్రమే గుర్తించాలని అన్నారు. ఇప్పటికీ నివేశన స్థలాలు లేక చాలామంది కూలినాలి చేస్తూ అద్దె గృహాల్లో కొనసాగుతున్నారని, వారిని గుర్తించాల్సిన అవసరం అధికారులపై ఉందని అన్నారు. ప్రభుత్వ స్థలాలను కొందరు పెద్దలు, ఉన్నతవర్గాల వారు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న సందర్భాలు ఉన్నాయని, వారి నుంచి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ శాఖను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బోడ రమేష్, సభ్యులుగా ఇంజం కొమురయ్య, కొయ్యడ లక్ష్మి, అఖిల్, ఫయాజ్, బండ రాజు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ముత్యాల రాజు, నాయకులు అమ్జద్‌పాషా పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి

డీఎస్పీ రవీందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 5: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డీఎస్పీ రవీందర్ సూచించారు. మంగళవారం సాయంత్రం ములుగు జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ కాలనీలోని యువతను సమావేశపరిచి మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు, గంజాయి, గుట్కాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని, చెడుదారిలోకి వెళ్లకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఈ అవకాశాలను ఉపయోగించుకుని మెరుగైన జీవనం పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ మేకల రంజిత్‌కుమార్, ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్

కాటారం, మార్చి 5: మండలంలోని ఒడిపిలవంచ జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా జరిగే ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కలిగడానికి మాక్ పోలింగ్ చేపట్టారు. ఎన్నికల్లో భాగంగా అభ్యర్థులు పోటీచేయడం, నామినేషన్లు, బ్యాలెట్ బాక్స్‌లు,పోలింగ్, ఫలితాల వెల్లడి వంటి అంశాలను ప్రదర్శించారు. మాక్ పోలింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని హెచ్ఎం గండు రాజబాబు అన్నారు. ఉపాధ్యాయులు సురేష్, మధు, పుష్పలీల, రాజారాం, వీరస్వామి, మంజుల పాల్గొన్నారు.

అయోధ్యకు బయల్దేరిన భక్తులు


అయోధ్యకు బయల్దేరే ముందు పూజల్లో పాల్గొన్న భక్తులు

చిట్యాల, మార్చి 5: అయోధ్య బాల రాముడిని దర్శించుకునేందుకు చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన 24 మంది భక్తులు మంగళవారం బయల్దేరారు. ఈసందర్భంగా స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్యాల ఖండ కార్యవాహ ఆధ్వర్యంలో 1990లో కరసేవలో పాల్గొన్న భక్తులను సన్మానించారు. ఈకార్యక్రమంలో చిట్యాల ఆర్ఎస్ఎస్ ప్రచారక్ మహేందర్‌జీ, కట్కూరి నరేందర్, దశరథం, ఎలేటి రాజు, శ్రీనివాస్, సదయ్య, వేణు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భర్త మద్యానికి బానిసయ్యాడని మహిళ ఆత్మహత్య


పోశమ్మ (ఫైల్)

వెంకటాపురం(నూగూరు), మార్చి 5: భర్త మద్యానికి బానిసయ్యాడనే మనస్తాపంతో పురుగు లమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని విజయపురికాలనీలో సోమ వారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. కాలనీలోని గగ్గూరి పోశమ్మ(27) భర్త శ్రీశైలం కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యుల ను ఇబ్బంది పెడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురైన పోశమ్మ సోమవా రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగింది. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఏదిర వైద్యశాలకు తరలించి చికిత్స అం దించా రు. పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో పోశమ్మ మృతిచెందింది. మృతురాలి తండ్రి వాదం ముత్యాలరావు ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

జీవో 68 ద్వారా నియామకాలు చేపట్టాలి

డీఎంహెచ్‌వోకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ వినతి

ములుగు కలెక్టరేట్, మార్చి 5: జీవో 68ద్వారా వైద్య ఆరోగ్యశాఖలో నియామకాలు చేపట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ములుగులో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ఏరియాలో వైద్యఆరోగ్యశాఖ జీవో 68 ద్వారా వంద శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఆదివాసీలకు ఉన్నప్పటికీ వలస గిరిజనేతరుల వల్ల ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివాసీలకు జీవనాధారమైన జీవోలను సుప్రీంకోర్టు ద్వారా కొట్టివేయించి వివిధ శాఖల్లో 94శాతం రిజర్వేషన్లు పొందాలని గిరిజనేతరులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జీవో 68ద్వారా ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించనట్లయితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చయ్య, పాయం భారతి, సోర్లం అరుణకుమారి, చంటి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గణపురంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గణపురం మార్చి 5: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపు, సబ్సిడీపై గ్యాస్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలను అమలు చేశామన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లకు రూ. 5లక్షలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కావటి రజిత, వైస్ ఎంపీపీ అశోక్, పీఏసీఎస్ చైర్మన్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు ఛోటామియా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, ఎంపీటీసీ సాగర్, నాయకులు నారాయణగౌడ్, గంగాధరరావు, రాజమౌళి, అశోక్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్, కృష్ణ, నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

చిట్యాల, మార్చి 5: మండల పరిధి ఒడితలలోని పురాతన శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించే శివ కల్యాణం జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కత్తి సతీష్, కాంగ్రె స్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ఆలయ డైరెక్టర్లు గట్టు రాజు, రాజేందర్, రాజబాబు, కాంపెల్లి శారద, నాయకులు బండి భగవాన్, ఎర్రబెల్లి భద్రయ్య, శంకర్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో పర్యటన

కన్నాయిగూడెం, మార్చి 5 : మండలంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా మంగళవారం పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు రిజిష్టరును పరిశీలించారు. వారం రోజులుగా సిబ్బంది హాజరు నమోదు చేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ఎవరైనా ఫీల్డ్ డ్యూటీలో ఉన్నట్లయితే రోగులను చూడ్డానికి ఎంఎల్‌హెచ్‌పీ, సూపర్‌వైజరును అందుబాటులో ఉంచాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని, బోధన తీరును పరిశీలించారు. టాయిలెట్లు లీకేజీలు, కీలక మైన మరమ్మతు పనులు సకాలంలో జరిగేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌ను ఆదేశించార

మండల పరిషత్‌లో ప్రజాపాలన సేవాకేంద్రం



ప్రజాసేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాటారం, మార్చి 5 :మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవాకేంద్రం (హెల్ప్ డెస్క్) ఏర్పాటైంది. గృహజ్యోతి పథకంలో భాగంగా పలువురు అర్హులైన లబ్ధిదారు లకు సైతం కరెంట్ జీరో బిల్లులు రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎంపీడీవో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశాలివ్వడంతో అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. సేవాకేంద్రం ఏర్పాటు చేసి ఇటీవల ప్రజాపాలన లో భాగంగా దరఖాస్తులు చేసుకున్న వారి నుంచి తగు ధృవీకరణ పత్రాలు తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టారు. మంగళవారం మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి ఆపరేటర్లకు తగిన సూచనలు ఇచ్చారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

టేకుమట్ల, మార్చి 5: ఈ నెల 7న వరంగల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ వరంగల్ పార్లమెంట్ స్థాయి సమావేశానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని భూపాపలపల్లి జిల్లా ఇన్‌చార్జి గాజుల భిక్షపతి కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రేణుకుంట్ల సంపత్ అధ్యక్షతన మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల పార్లమెంటరీ స్థాయి సమావేశంలో వరంగల్‌లో గురువారం జరగనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరయ్యే సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై దిశదిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మండల నాయకులు ఎలుకటి నర్సయ్య, అక్కల భద్రయ్య, సిరికొండ సాంబయ్య, అంబాల మూగయ్య , వడకపురం రవి, మాట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను సన్మానించిన నాయకులు

గోవిందరావుపేట, మార్చి 5: ఇటీవల మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గార్లపాటి జవహర్ రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ నాయ కులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసంద ర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానిం చారు. ఈసందర్భంగా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గణపాక సుధాకర్ మాట్లా డుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రజల అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసర్ల రాంబాబు, కందాల వెంకన్న, చుక్క కొమురయ్య, గోపిదాస్ వజ్రమ్మ, మజిత, సజనా, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదొడ్డిలో ప్రత్యేక వైద్య శిబిరం

వాజేడు, మార్చి 5: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డిలో మం గళవారం వైద్య ఆరోగ్యశాఖ అధి కారులు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నెలరోజులుగా ఈ గ్రామంలో జ్వరాలతో ప్రజ లు బాధపడు తున్నారు. ఈ క్రమంలో గత వారం హెల్త్‌క్యాం పులు ఏర్పాటు చేసి చికిత్సలు అందించిన ప్పటికీ జ్వరాలు అదుపులోకి రాలేదు. దీంతో డీఎంహెచ్‌వో డాక్టరు అల్లెం అప్పయ్య ఆదేశాల మేరకు గ్రామంలో వైద్యాధికారులు రెండు బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వేను నిర్వహించారు. ముఖం వాపులు, జ్వరాలు, కీళ్లనొప్పులు, వాంతులు, విరేచనాల లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. అదే విధంగా రక్తనమూనాలు సేకరించి ములుగు డయగ్నొస్టిక్ హబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. గ్రామస్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనారోగ్య లక్షణాలు ఉంటే ఆస్పత్రికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అల్లి మధుకర్, కొమురం మహేందర్, సీహెచ్‌వో సూర్యప్రకాశరావు, హెచ్ఎస్ కోటిరెడ్డి, ఎల్‌టీ రజినికాంత్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లు పూర్తి చేయండి

అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి), మార్చి 5: మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కాళేశ్వరంలో పర్యటించిన ఆయన వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, షవర్స్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పనులు బుధవారం మధ్యాహ్నానికి పూర్తి చేసి భక్తులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఈవో మారుతి తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో బర్త్‌డే పార్టీ!

సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్న దృశ్యాలు

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి), మార్చి 5: కొందరు పోలీసులు తమ స్థాయిని మరచిపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పరపతి ఉన్న వ్యక్తులతో సత్సంబంధాలు పెంచుకుంటూ పబ్బం గడుపుకోవడమే అసలైన డ్యూటీ అనుకుంటున్నారని, వారిని మన్ననలు పొందేందుకు పడరాని పాట్లు పడుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఓ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకున్న పరిణామమే ఇందుకు నిదర్శనం.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల ఎస్సై ఈనెల 3న మండలకేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ వ్యక్తి జన్మదిన వేడుకలను ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే ఏర్పాటు చేసి కేకులు కట్ చేశారనే వార్త తీవ్ర దుమారం రేపింది. జన్మదిన వేడుకలకు సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పోలీసుల వైఖరిపై సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహించొద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ ఎస్సై తన విధులను మరచి ప్రైవేట్ వ్యక్తి జన్మదిన వేడకలు జరిపారని తెలుస్తోంది.. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్ అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండు, మూడురోజుల్లో ఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన ఎస్సైపై పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జవహర్‌నగర్‌లో బోరు ఏర్పాటు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 5: మండలంలోని జవహర్‌నగర్ వడ్డెరకాలనీలోని 7,8 వార్డుల ప్రజల తాగునీటి సౌకర్యార్థం కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు బోరును ఏర్పాటు చేయగా దానిని మంగళవారం ప్రారరంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిట్ట రమేష్, రేపాక పోశాలు, ఓలెపు రమేష్, రవి, నాగవెల్లి సత్యనారాయణ, జంపయ్య, రవి, రాంబాబు, ప్రసాద్, కరుణాకర్, సతీష్, బాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.